క్లుప్తంగా

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

నెహ్రూనగర్: అయిశెట్టి సీతారామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10వ తేదీ నుంచి తృతీయ సంక్రాంతి సంబరాలు 56వ డివిజన్ నెహ్రూనగర్ 6వ లైనులో నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ఫౌండర్ అయిశెట్టి శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా అనంత పద్మనాభ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సంబరాల్లో భాగంగా మహిళలు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ముగిసిన ఆవాజ్ రాష్ట్ర మహాసభలు

పాత గుంటూరు: ఆవాజ్ రాష్ట్ర మహాసభ గుంటూరు లాల్‌జాన్‌బాషా కల్యాణ మండపంలో సోమవారం జరిగింది. గౌరవాధ్యక్షుడు ఎం.ఎ.గఫూర్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సభలో తెలంగాణ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. అబ్బాస్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఆవాజ్ రాష్ట్ర నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.ఎ.సుభాన్, ఎం.ఎ.చిష్టీ ఎన్నికయ్యారు. మొత్తం 30 మందితో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎస్.ఎ.కె.జిలానీ, షేక్.అబుబకర్, సహాయ కార్యదర్శులుగా షేక్.యాజ్‌దాని, ట్రెజరర్‌గా ఎం.ఎ.ఎ.అష్రఫ్, మరో 24 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్.ఎ.సుభానీస్, ఎస్.కె జిలానీ, అష్రాఫ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

పాత గుంటూరు: ఫిబ్రవరి 5న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలోని గిరి ప్రదక్షణకు గుంటూరు 2 డిపో నుంచి స్పెషల్ హైటెక్ బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ షేక్. అబ్దుల్ సలామ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆ బస్సులు ఫిబ్రవరి 3వ తేదీన రాత్రి 09.15, 09.30 గంటలకు గుంటూరులో బయలుదేరి శ్రీ కాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకుంటూ ఫిబ్రవరి 4 తేదీన సాయంత్రం అరుణాచలం చేరుతుందని అన్నారు. అరుణాచలేశ్వరుని దర్శించుకుని ఫిబ్రవరి 5న సాయంత్రం అరుణాచలంలో బయలుదేరి 6న ఉదయం 6:30 గంటలకు గుంటూరు చేరుతాయని మేనేజర్ తెలిపారు. ఒక్కో టికెట్ ధర రూ. 2400 మాత్రమేనని అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. అదనపు సమాచారం కోసం 7382894409, 7382896403, 9959225421 నంబర్‌లను సంప్రదించాలని అన్నారు.

విజయవాడ వాసి గుంటూరులో మృతి

గుంటూరు ఈస్ట్: అనుమానాదస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం గతనెల 25వ తేదీ సెయింట్ జోసఫ్ హాస్పిటల్ మెయిన్ గేటు ఎదురుగా ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి అతని జేబులోని ఆధార్‌కార్డు ఆధారంగా విజయవాడ, గాంధీనగర్‌కు చెందిన జి.రంగారావు (48)గా గుర్తించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అయితే ఇప్పటివరకు అతని అడ్రస్సు వివరాలు తెలియరాలేదు. సమాచారం తెలిసిన వారు 8688831336 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

కోడి పందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు

నల్లపాడు సీఐ శ్రీనివాసరావు

గుంటూరు రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో కోడి పందేలు, జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ బి. శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. స్టేషన్ పరిధిలో గతంలో వీటికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుని ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. వివాదాస్పద ఘటనల్లో రౌడీషీటర్లు ఉన్నారని తెలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సంక్రాంతి పండుగను కుటుంబంతో సంతోషంగా జరుపుకోవాలని, హానికర ఘటనలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వృద్ధుడికి ట్రైసైకిల్ పంపిణీ



గుంటూరు రూరల్: ప్రత్తిపాడు మండలం చిన్నకోండ్రుపాడుకు చెందిన మేడా నాగయ్య అనే 60 సంవత్సరాల వృద్ధుడికి ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ట్రై సైకిల్‌ను అందజేశారు. నాగయ్య కుటుంబం కూలీ నాలీ చేసుకుని జీవిస్తుంటుంది. నడవలేని స్థితిలో ఉన్న అతడు ట్రైసైకిల్‌ను ఇవ్వాలని కోరాడు. దీంతో సోమవారం నగరంలోని తన కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సుచరిత దాన్ని అందజేశారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు చెప్పారు. అడిగిన వెంటనే సాయం చేసిన ఎమ్మెల్యేకు, ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి నాగయ్య కృతజ్ఞతలు తెలిపారు.

మెరుగైన సేవలందించేలా పనిచేయాలి

- కార్యదర్శులకు కమిషనర్ ఆదేశం
- జూమ్ ద్వారా ప్రత్యేక సమావేశం
- స్పందనకు 60 ఫిర్యాదులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ఆయా కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన, సచివాలయ కార్యదర్శులతో జూమ్ ద్వారా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత జూమ్ ద్వారా సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి సేవకు అందే అర్జీలు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. సచివాలయాల్లో కార్యదర్శుల పనితీరు మెరుగుపడాలని, ప్రతి సోమవారం నోడల్ అధికారులతో ప్రత్యేకంగా సచివాలయ కార్యదర్శుల పనితీరు, సేవలు, స్థానిక సమస్యలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం పెట్టాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. సిటిజన్ పర్సెప్షన్ సర్వేలో జాతీయస్థాయిలో గుంటూరు నగరం మొదటి స్థానంలో నిలవడంలో కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోండి

రానున్న కాలంలో ఆస్తి పన్ను నూరు శాతం వసూళ్లు చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని అడ్మిన్ కార్యదర్శులను, స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా శానిటేషన్ కార్యదర్శులు సచివాలయం పరిధిలో హోం, క్లస్టర్ కంపోస్ట్ తయారీపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బహిరంగ మల విసర్జన లేకుండా చర్యలు తీసుకోవాలని, రోడ్ల మీద, కాల్వల్లో వ్యర్థాలు వేసే షాప్స్‌ని సీజ్ చేయాలన్నారు. ప్లానింగ్ కార్యదర్శులు రెండు రోజుల్లో ఎల్.ఆర్.ఎస్. ప్యాట్రన్‌లను అప్ లోడ్ చేయాలని, ఎమినిటి కార్యదర్శులు పాట్ హోల్స్‌ని యాప్‌లో పొందుపరచాలని, తాగునీటి శ్యాంపిల్స్‌లో ప్రతిరోజు నీటి పరీక్షలు చేయాలని ఆదేశించారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ ఉండాలన్నారు. అనంతరం గతవారం స్పందన ఫిర్యాదులు, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి., వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో, సంబంధిత కార్యదర్శులతో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి అలసత్వం వహించవద్దని, నిర్దేశిత గడువులోగా ఫిర్యాదులు, అర్జీలు పరిష్కరించాల్సిన బాధ్యత విభాగాధిపతిదేనని తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 60 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 14, ఇంజినీరింగ్ విభాగానికి 18, ప్రజారోగ్య విభాగానికి 8, రెవెన్యూ విభాగానికి 14, ఉపా సెల్ విభాగానికి 2, పరిపాలన విభాగానికి 3, అకౌంట్స్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదు అందాయన్నారు. ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ మూర్తి, సీఎంఓహెచ్. డాక్టర్ విజయలక్ష్మీ, ఎంహెచ్ఓ. డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఏసీపీలు, ఆర్.ఓ.లు, ఈ.ఈ లు, ఎస్ఎస్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్‌కు ప్రజాసంకల్పయాత్రతో 'దశ-దిశ'



కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ మేయర్ బాలవజ్ర బాబు, నూరిఫాతిమా

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆనాడు ప్రతిపక్ష నేతగా చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర రాష్ట్ర భవిష్యత్‌కు దశదిశ నిర్దేశించిందని నగర డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ మహిళా నేత షేక్ నూరిఫాతిమా చెప్పారు. ప్రజాసంకల్ప యాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా సోమవారం బుచ్చయ్య తోటలో మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన జరుగుతున్న సమయంలో బాధ్యత గల ప్రతిపక్ష నేతగా సీఎం జగన్ పాదయాత్ర చేపట్టి, ప్రజలకు అండగా తానున్నానే భరోసాని కల్పించారన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ పరిపాలన చేపట్టిన తరువాత సుదీర్ఘ పాదయాత్రలో తెలుసుకున్న ప్రతి సమస్యను పరిష్కరించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు ఎస్. శ్రీనివాసరావు, రాందాసు, షంషేర్, అబ్దుల్‌సలామ్, రమణయ్య, శ్రీనివాసరావు, సత్యన్నారాయణ, హెరాల్డ్, అక్బర్, రమేష్, విజయ, రాహేల, సుబ్బులు, సుబ్బారెడ్డి, చెన్నుపాటి శ్రీను, గాలయ్య, కార్పొరేటర్లు అయిశెట్టి కనకదుర్గ, యాట్ల రవి, టిడ్కో కార్పొరేషన్ డైరెక్టర్ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లలో ఎంతో సంతోషంగా ఉన్నాం

ప్రత్తిపాడు: జగనన్న లే అవుట్‌లో తమకిచ్చిన స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నాం.. వాటిల్లో ఎంతో సంతోషంగా కుటుంబంతో కలసి ఉంటున్నామని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావుకు స్పష్టం చేశారు. ప్రత్తిపాడులోని జగనన్న లేఅవుట్‌లో సోమవారం మధ్యాహ్నం ఆయన పర్యటించారు. ఇళ్లు నిర్మించుకుంటున్న వారితో, నిర్మాణం పూర్తి చేసుకుని ఇంట్లో నివసిస్తున్న వారితో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఎంత ఇస్తుంది, బిల్లులు వచ్చాయా రాలేదా? అదనంగా ఇంటి నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుంది, లే అవుట్‌లో ఎలాంటి సమస్యలు ఉన్నాయి.. వంటి వివరాలను అడిగి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు తమకు ప్రభుత్వం నుంచి ఇసుక, ఇనుము, సిమెంటు బస్తాలు అన్నీ సక్రమంగానే అందాయని చెప్పారు. కాకపోతే ఇంటి నిర్మాణం సమయంలో నీటికి కాస్తంత ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అనంతరం మరో లబ్ధిదారుడు షేక్ బాజిని ఎమ్మెల్సీ పలకరించగా, తామంతా ఎంతో ఆనందంగా సొంతింటిలో ఉన్నామని చెప్పారు. లబ్ధిదారుడు కోరడంతో ఎమ్మెల్సీ ఇంటిని పరిశీలించారు. లేఅవుట్ వెంబడి పొలం ఉన్న ఓ రైతు పొలం నీరు బయటకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని, సమస్యను పరిష్కరించాలని చెప్పడంతో ఎమ్మెల్సీ ఆర్డీవోతో మాట్లాడారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి. లక్ష్మణ రావు తదితరులున్నారు.

శాస్త్రీయ భావాలే ప్రజాస్వామ్యానికి పునాది

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మాణిక్యవరప్రసాద్

పాత గుంటూరు: శాస్త్రీయ భావాలే ప్రజాస్వామ్య పునాది అని ఆ దిశగా కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి కృషి చేశారని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాషువా పూలే పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార సభ నిర్వహించారు. సభకు కవి బి.విల్సన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సమాజంలో అగ్ర కులాధిపత్యంపై కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి గొప్ప సాంస్కృతిక పోరాటం చేశారని తెలిపారు. దేశంలో కులం, మతం సంస్కృతికి చెందిన అంశాలని అన్నారు. మతం సంస్కరించబడింది కానీ కులం మాత్రం కరుడు గట్టుకుపోయిందన్నారు. దీనిని ప్రజాస్వామికరించడమే ప్రస్తుతం కవిరాజు త్రిపురనేని భావాల వారసుల కర్తవ్యమని సూచించారు. ఈ సందర్భంగా కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కారాన్ని ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, డీబీఎఫ్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, డాక్టర్ పాపినేని శివశంకర్‌లకు ప్రధానం చేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, ఎస్.ఎం. సుభాని, బి.శ్యాంబాబు, చల్లా మధుసూచన రావు, పాత్తూరి దుర్గాదేవి, సినీనటులు చిట్టినేని లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

శభాష్ ఆర్పీఎఫ్ పోలీసులు

- మరచిపోయిన హ్యాండ్ బ్యాగ్‌ను అందజేసిన సిబ్బంది
- ఆర్పీఎఫ్ సిబ్బందిని అభినందించిన డీఎస్సీ హరప్రసాద్
- ఆపరేషన్ అమనాత్‌కు కృతజ్ఞతలు తెలిపిన బాధితురాలు



హ్యాండ్ బ్యాగ్‌ను అందజేస్తున్న గుంటూరు రైల్వే డివిజన్ డీఎస్సీ హరప్రసాద్, సీఐ రామయ్య

లక్ష్మీపురం: రైలులో మరచిపోయిన హ్యాండ్ బ్యాగ్‌ను అందులో ఉన్న రూ.2 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదును బాధితురాలికు తిరిగి అప్పగించిన ఘటన సోమవారం సాయంత్రం గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో చోటు చేసుకుంది. గుంటూరు రైల్వే ఆర్పీఎఫ్ సీఐ రామయ్య తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన సైకాలజిస్ట్ వి. దాక్షాయణి విజయవాడ నుంచి మహబూబాబాద్‌కు రైలు నెంబర్ 12731 శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం బయలు దేరారు. ఆమెతో పాటు చేతిలో హ్యాండ్ బ్యాగ్ అందులో రూ.2 లక్షల విలువ చేసే బంగారం, విలువైన పత్రాలు, రూ.2వేల నగదు ఉన్నాయి. రైలు దిగే క్రమంలో హ్యాండ్ బ్యాగ్‌ను మహబూబాబాద్‌లో మరచిపోయారు. స్టేషన్ బయటకు వచ్చే ముందు హ్యాండ్ బ్యాగ్‌ను మరచి పోయినట్లు గమనించిన బాధితురాలు దాక్షాయణి గుంటూరు రైల్వే అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ డి.శరత్ బాబుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. స్పందించిన డీఎస్సీ శరత్‌బాబు గుంటూరు రైల్వే ఆర్పీఎఫ్ సీఐ రామయ్యకు సమాచారం అందించి తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా తెలిపారు. వెంటనే ఆర్పీఎఫ్ సెక్యూరిటీ కానిస్టేబుల్ నాగరాజు ద్వారా శాతవాహన డి-1లో గల టీటీఈ సల్మాన్ రాజుగా గుర్తించారు. ఆయనకు ఫోన్ చేసి హ్యాండ్ బ్యాగ్‌ని తక్షణమే గుంటూరు ఆర్పీఎఫ్ స్టేషన్‌కు పంపించాల్సిందిగా సూచించారు. హ్యాండ్ బ్యాగ్‌ను గుంటూరు డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ కె.ఎస్ హరప్రసాద్‌కు అప్పగించారు. హ్యాండ్‌బ్యాగ్‌ను గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో డీఎస్సీ కార్యాలయానికి వచ్చి తీసుకు వెళ్లాల్సిందిగా సైకాలజిస్ట్ వి.దాక్షాయణికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న దాక్షాయణి సోమవారం సాయంత్రం గుంటూరు డీఆర్ఎం కార్యాలయంలోని డీఎస్సీ హరప్రసాద్, ఎఎస్సీ శరత్‌బాబు, ఆర్పీఎఫ్ సీఐ రామయ్యలు కలిసి బాధితురాలు దాక్షాయణికి హ్యాండ్ బ్యాగ్‌ను అప్పగించారు. ఆపరేషన్ అమానత్ అనే కార్యక్రమం వల్ల చాలా మేలు జరిగిందని ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా డివిజన్ డీఎస్సీ కె.ఎస్.హరప్రసాద్ మాట్లాడుతూ హ్యాండ్‌బ్యాగ్‌ను మరచి పోయిన విషయాన్ని బాధితురాలు దాక్షాయణి ఎప్పుడైతే ఏఎస్సీ శరత్ బాబుకు సమాచారం అందించిన మరుక్షణమే ఆపరేషన్‌ను మొదలుపెట్టడం జరిగిందని మరలా బాధితురాలి బ్యాగ్‌ను గంటల వ్యవధిలో ఫోన్‌ల ద్వారా ఒకరినొకరు సమాచారం చేరవేసుకుని బ్యాగ్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. రైలులో ప్రయాణం చేసే సమయంలో విలువైన బంగారు ఆభరణాలు, నగదు వంటివి తీసుకురావద్దని, ఒకవేళ అటువంటి వస్తువులు ఉన్న సమయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా రైల్వే పోలీసులు ప్రజలకు పలు సందర్భాలలో అవగాహన కల్పిస్తుంటారన్నారు. రైలు ప్రయాణికులు ఖచ్చితంగా జాగ్రత్తలు పాటించడం వల్ల ప్రమాదాలు, దొంగతనాలు వంటివి అరికట్టవచ్చన్నారు.

జగనన్న ప్రజా సంకల్ప యాత్ర చరిత్రాత్మకం

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర చరిత్రాత్మకమని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. నగరంలోని బ్రాడీపేట నందున్న ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ప్రజా సంకల్ప యాత్రను చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహానేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర మంతటా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చి చరిత్ర సృష్టించాడని తెలిపారు. ప్రజా సంకల్ప యాత్రతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం నవరత్నాల పథకాలు, గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, అర్బన్ హెల్త్ క్లినిక్‌లు, అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, ఆటోవాలాలకు ఆర్థిక సాయం, జగనన్న భరోసా, మహిళలకు సున్నా వడ్డీ రుణాలు, యువతకు ఉద్యోగాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి గడపకు సంక్షేమ పథకాల్ని అందిస్తూ దేశంలోనే మార్గదర్శక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేశా రని కొనియాడారు. ప్రతి రాష్ట్రం మన జగనన్న అమలు చేస్తున్న పథకాలను వారి రాష్ట్రాల్లో అమలు చేసుకునేందుకు కృషి చేస్తున్నారంటే, మన రాష్ట్రంలో సంక్షేమం, ప్రజా అభివృద్ధి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తుమ్మల సుబ్బారావు, విప్పాల కృష్ణారెడ్డి, భీమినేని వెంకటలక్ష్మి, గుల్జార్ బేగం, మండల కన్వీనర్లు గట్టు విజయ్‌కుమార్, ఆళ్ళ రవిదేవరాజు, మదమంచి వాసు, కార్పొరేటర్లు తనబుద్దు కృష్ణారెడ్డి, ఏరువ సాంబిరెడ్డి, స్మిత పద్మజ, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, డబ్బూరి సూర్యప్రకాశరావు, మెట్టు వెంకటప్పారెడ్డి, జల్లేపల్లి వేణుబాబు, కాశీంపీరా, తంగెళ్ల నాగేశ్వరావు, దుంపాల రాధ, మెరిగల రవిబాబు, ముత్యాల నాగరాజు, ఆరుదల సాంబశివరావు, మిన్నకూరి శంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రేషన్ షాపులపై విజిలెన్స్ దాడులు



కాకుమానులోని రేషన్ షాపులో స్టాకు వివరాలను పరిశీలిస్తున్న సీఐ శ్రీహరిరావు

కాకుమాను: విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం కాకుమానులోని రెండు రేషన్ షాపులపై దాడులు నిర్వహించారు.షాపు నంబర్-1లో ఉండాల్సిన నిల్వ కన్నా తొమ్మిది బస్తాలు(450 కేజీలు) తక్కువగా ఉండడంతో కేసు నమోదు చేశారు. షాపు నంబర్ -2లో ఉండాల్సిన నిల్వ కన్నా 119 బస్తాలు (5950 కేజీలు) తక్కువగా ఉండంతో కేసుతో పాటు డీలర్, బినామీ డీలర్లపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీఐ ఎ.శ్రీహరిరావు సిబ్బందిని ఆదేశించారు. దాడుల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నవీన్, వీఆర్వోలు సూరిబాబు, సరోజిని, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



ముందస్తు సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇన్నర్‌రింగ్‌రోడ్డు అన్నపూర్ణనగర్ ఐదోలైనులోని విజేత ఐఐటీ కాన్సెప్ట్ స్కూల్ క్రీడా మైదానంలో సోమవారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రాంగణమంతా రంగవల్లులు, గొబ్బెమ్మలు, మామిడి ఆకులు, వివిధ రకాల పూలు, గాలి పతంగులతో శోభాయమానంగా అలంకరించారు. గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించేలా దేవాలయం, ఇల్లు, గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటలు, హరిదాసుల సంకీర్తనలు, చిన్నారులకు భోగి పళ్లు పోసి సందడి చేశారు. పొంగళ్లు వండి, సాంప్రదాయ పిండి వంటల రుచులను ఆస్వాదించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, చిన్నారులు, సాంప్రదాయ దుస్తులలో తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా వస్త్రధారణతో కనువిందు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఈవీ గిరీష్ బాబు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తమ పాఠశాలలో ఐఐటీ, నీట్ ఫౌండేషన్‌తో పాటు నవోదయ, సైనిక విద్యాసంస్థల్లో సీట్లు సాధించేలా విద్యా బోధన అందిస్తూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యా సంస్థ కార్యదర్శి మిన్నేకంటి శ్రీనివాస రావు, డైరెక్టర్లు నిమ్మల సురేష్, ఏలూరి లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ అరుణ తదితరులు పాల్గొన్నారు

కర్రసాములో బంగారు పతకాలు



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

గుంటూరు ఎడ్యుకేషన్: హిందూ కళాశాలలో ఈనెల 8వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి సిలబం చాంపియన్‌షిప్ (కర్రసాము)లో పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ నాలుగో తరగతి విద్యార్థిని బుసపురం రమ్యశ్రీ రెడ్డి, ఏడో తరగతి విద్యార్థిని బుసపురం హర్షవర్ధిని బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. మేటి యుద్ధ విద్య అయిన కర్రసాములో ప్రావీణ్యం పొందడం ద్వారా విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. ఈసందర్భంగా విద్యార్థినులను పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు దేవినేని మల్లిఖార్జునరావు, సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

వైద్య విద్యార్థుల ఆత్మీయ కలయిక



వైద్య విద్యార్థులతో శ్రీరామ్, డైరెక్టర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఆర్క విద్యాసంస్థ నుంచి గత రెండేళ్లలో మెడికల్ సీట్లను సాధించి, వివిధ వైద్య కళాశాలల్లో వైద్యవిద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆత్మీయ కలయికను సోమవారం స్థానికంగా ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈసందర్భంగా విద్యాసంస్థ చైర్మన్ బి.శ్రీరామ్ మాట్లాడుతూ స్థాపించిన రేండేళ్లలోనే అత్యధిక మెడికల్ సీట్లు సాధించామని, అత్యుత్తమ క్రమశిక్షణతో కూడిన కోచింగ్‌ను అందిస్తూ అందరి మన్ననలను పొందామని తెలిపారు. 2020-21, 2021-22 బ్యాచ్‌ల నుంచి అత్యధిక మెడికల్ సీట్లు సాధించి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ మెడికల్ కాలేజీల్లో విద్యార్థినీ, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని వివరించారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో అత్యుత్తమ విద్యా బోధన, ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ కల్పిస్తున్నామని, తమ సంస్థ ప్రగతికి పూర్వ విద్యార్థులే ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వి.అనిల్, పి.వాసు, కె.ప్రసాద్, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

మందుబాబుల ఆగడాలను ఉపేక్షించం



బడ్డీ దుకాణాల నిర్వాహకులను హెచ్చరిస్తున్న ప్రత్తిపాడు సెబ్ ఎస్ఐ గీత

ప్రత్తిపాడు: బహిరంగ ప్రదేశాల్లో మందుబాబులు ఆగడాలకు పాల్పడితే ఉపేక్షించబోమని ప్రత్తిపాడు సెబ్ ఎస్ఐ గీత హెచ్చరించారు. ప్రత్తిపాడులోని పలు బడ్డీ కొట్ల వద్ద మందుబాబులు సిట్టింగ్‌లను ఏర్పాటు చేసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ సెబ్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్యకేంద్రం, పాఠశాలలకు సమీపంలోనూ బహిరంగంగా మద్యం తాగి గ్లాసులు, సీసాలు అక్కడే పడేస్తున్నారన్న ఫిర్యాదులూ రావడంతో సోమవారం ఎస్ఐ గీత గ్రామ మహిళా పోలీసులతో కలసి బడ్డీ బంకుల్లో సోదాలు చేశారు. మద్యం విక్రయిస్తున్నారా, స్టాక్ ఉందా? అని పరిశీలించారు. దుకాణాల నిర్వాహకులతో మాట్లాడారు. మందుబాబులకు గ్లాసులు కూడా విక్రయించడానికి వీల్లేదని చెప్పారు. ఇకపై ఇక్కడే కూర్చొబెట్టి తాగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బహిరంగ ప్రకటన

[illegible]

ధూళిపాళ్ళ దత్తాత్రేయులు, అడ్వకేట్
డోర్.నెం.26-31-100/ఎ. 6వ లైను, ఏటీ అగ్రహారం, గుంటూరు. సెల్: 7702922895